# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 18-02-2026** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నంలో నిర్వహిస్తున్న అంతర్జాతీయ ఫ్లీట్ రివ్యూలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈ రోజు పాల్గొంటారు.**

2. **ముంబైలో నిర్వహిస్తున్న 'క్లైమెట్ వీక్' సదస్సుకు తెలంగాణ ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి ఈరోజు హాజరవుతారు.**

3. **రబీ సీజన్ కింద 94 వేల 500 మెట్రిక్ టన్నుల శనగలను కొనుగోలు చేయనున్నట్లు ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు.**

4. **ఆంధ్రప్రదేశ్ లోని విజయవాడ రైల్వే స్టేషన్ ను పిపిపి విధానంలో అభివృద్ధి చేయనున్నామని పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్ వెల్లడించారు.**

==========================

విశాఖపట్నంలో భారత నౌకాదళం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అంతర్జాతీయ ఫ్లీట్ రివ్యూ -ఐఎఫ్ఆర్ లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈరోజు పాల్గొని నౌకాదళ సైనిక విన్యాసాలను పరిశీలిస్తారు. యుద్ధనౌకల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తారు. ఈ సందర్భంగా దేశ భద్రత, సముద్ర రక్షణపై రాష్ట్రపతి ప్రసంగిస్తారు. కార్యక్రమం అనంతరం మధ్యాహ్నం విశాఖపట్నం నుంచి ఢిల్లీకి బయలుదేరి వెళ్లనున్నారు. రష్యా, ఆస్ట్రేలియా, యూఏఈ.. వంటి దేశాల నుంచి వచ్చిన 19 విదేశీ నౌకలు, భారత నౌకా దళానికి చెందిన 45 నౌకలు, కోస్ట్‌గార్డ్, మర్చంట్ నేవీ, పరిశోధన నౌకలు 7 ఫ్లీట్ రివ్యూలో పాల్గొననున్నాయి. ఫ్లీట్ రివ్యూ కార్యక్రమంలో పాల్గొనేందుకు నిన్న విశాఖపట్నంకు చేరుకున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు ఆంధ్రప్రదేశ్ గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్, ఉపముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్, జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ తో పాటు నౌకా దళ అధికారులు స్వాగతం పలికారు. అనంతరం నేవల్ బేస్‌కు చేరుకుని అక్కడ ఏర్పాటు చేసిన ప్రెసిడెన్షియల్ బాంక్వెట్ విందులో పాల్గొన్నారు. ఈరోజు జరిగే ఫ్లీట్ రివ్యూలో పాల్గొనేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నిన్న రాత్రి విశాఖ చేరుకున్నారు.

--------------------------

ఆంధ్రప్రదేశ్ లోని గుంటూరు జిల్లా మంగళగిరిలోని అఖిల భారత వైద్య విజ్ఞాన సంస్థ -ఎయిమ్స్ 2వ స్నాతకోత్సవాన్ని నిన్న నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర ఆరోగ్య శాఖ సహాయ మంత్రి అనుప్రియ పటేల్, ఆంధ్రప్రదేశ్ విద్యా శాఖ మంత్రి లోకేశ్ ముఖ్య అతిథులుగా హాజరై విద్యార్థులకు పట్టాలను ప్రదానం చేశారు. అనంతరం కేంద్ర మంత్రి అనుప్రియ పటేల్ మాట్లాడుతూ,కేంద్ర ప్రభుత్వం వైద్య రంగంలో అనేక గొప్ప మార్పులు

తీసుకొచ్చిందని తెలిపారు. వైద్య విద్య కోసం విదేశాలకు వెళ్లకుండా దేశంలోనే పెద్దసంఖ్యలో వైద్య కళాశాలలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ, ఎయిమ్స్ ద్వారా ప్రజలకు అత్యాధునిక వైద్యం అందుతోందని చెబుతూ...

వాయిస్..30.. సెకన్లు

---------------------------

మహారాష్ట్ర ప్రభుత్వం, బృహన్ ముంబయి కార్పొరేషన్ సంయుక్త ఆధ్వర్యంలో 'క్లైమెట్ వీక్' నిర్వహిస్తున్న సదస్సులో తెలంగాణ ముఖ్యమంత్రి ఈ రోజు పాల్గొంటారు. తెలంగాణలో అభివృద్ధి, పరిపాలన వంటి అంశాలను ఈ వేదికపై ఏ.రేవంత్‌రెడ్డి వివరించనున్నారు. ఈ కార్యక్రమం అనంతరం సాయంత్రం ముఖ్యమంత్రి ముంబయి నుంచి బయలు దేరి ఢిల్లీకి వెళ్లనున్నారు. రేపు ఢిల్లీలోని కాంగ్రెస్ ప్రధాన కార్యాలయం ఇందిరాభవన్‌లో ఏఐసీసీ ముఖ్యనాయకులు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, కేసి వేణుగోపాల్‌తో రేపు సమావేశమై మున్సిపల్ ఎన్నికల్లో పార్టీ విజయాలు, ఇతర అంశాలపై చర్చించనున్నారని పార్టీ వర్గాలు తెలిపాయి.

---------------------------

ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా శనగల కొనుగోళ్లు చేపట్టామని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. రబీ సీజన్ కింద 2025--26లో పండించిన శనగలను మద్దతు ధర పథకం కింద 94,500 మెట్రిక్ టన్నుల వరకు కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. యాప్ ద్వారా అన్ని జిల్లాల్లో కొనుగోళ్ల ప్రక్రియ చేపట్టాలని అధికారులకు సూచించినట్లు వెల్లడించారు. జిల్లా స్థాయి కమిటీలు కొనుగోళ్లను పర్యవేక్షిస్తాయని, రైతు సేవా కేంద్రాల ద్వారా పారదర్శకంగా కొనుగోళ్లు జరుగుతాయని పేర్కొన్నారు. కొనుగోలు చేసిన శనగలకు రైతులకు 15 రోజుల్లోపు నేరుగా రైతులకు చెల్లింపులు అందేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. రైతులు తమ ఉత్పత్తిని సమీప కేంద్రాలకు తరలించి నమోదు చేసుకోవాలని మంత్రి కోరారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ శాసనసభ సమావేశాల్లో భాగంగా పంచాయతీరాజ్, మున్సిపల్, విద్యుత్, ఆరోగ్య, దేవాదాయ శాఖలకు చెందిన ఏడు చట్టాల్లో సవరణలకు సంబంధించిన బిల్లులను ఆయా శాఖల మంత్రులు ఈ రోజు సభలో ప్రవేశపెట్టనున్నారు. రహదారులకు ఇరువైపులా పచ్చదనం పెంపు, మాజీ సైనికులకు భూమితోపాటు వివిధ నియోజకవర్గాల అంశాలపై సభ్యులు అడిగిన ప్రశ్నలకు సంబంధిత శాఖల మంత్రులు ప్రశ్నోత్తరాల సమయంలో సమాధానాలివ్వనున్నారు. బడ్జెట్‌పై సాధారణ చర్చ రెండోరోజు కొనసాగనుంది. ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ బడ్జెట్ పై జరిగిన చర్చకు ఈరోజు సమాధానం ఇస్తారు. అలాగే శాసనమండలిలోనూ బడ్జెట్‌పై సాధారణ చర్చ, సభ్యుల ప్రశ్నోత్తరాలు కొనసాగనున్నాయి.

---------------------------

దేశ భద్రత, నిర్మాణంలో సైనికుల సహకారం అమూల్యమని ఆంధ్రప్రదేశ్ హోం మంత్రి వంగలపూడి అనిత పేర్కొన్నారు. సైనిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో విజయవాడలో నిర్వహించిన మాజీ సైనికుల దినోత్సవం 'వెటరన్స్ డే' వేడుకల్లో మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా హోం మంత్రి అనిత మాట్లాడుతూ, విధుల్లో ఉన్నా లేకపోయినా మాజీ సైనికులు సరిహద్దుల్లోనే కాకుండా సమాజంలోనూ, విపత్తుల సమయంలో అందిస్తున్న సేవలు అమోఘమని ప్రశంసించారు. సైనికులతో సమానంగా త్యాగం చేస్తున్న వారి కుటుంబ సభ్యులకు రాష్ట్ర ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. మాజీ సైనికుల సంక్షేమం కోసం

ప్రత్యేకంగా సైనిక్ సంక్షేమ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసి మాజీ సైనికుల సమస్యలను పరిష్కరిస్తున్నామని తెలిపారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ లోని విజయవాడ రైల్వే స్టేషన్ ను ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యం – పిపిపి విధానంలో అభివృద్ధి చేయనున్నామని పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్ వెల్లడించారు. విజయవాడలోని డి ఆర్ ఎం కార్యాలయంలో రైల్వే అధికారులతో డివిజన్ పరిధిలోని ప్రాజెక్టుల నిర్మాణం, పురోగతిపై నిన్న చర్చించారు. అనంతరం కేశినేని శివనాథ్ పాత్రికేయులతో మాట్లాడుతూ, విజయవాడలో రైల్వే లైన్లతో అనుసంధానమై ఉన్న డ్రైనేజ్ సమస్యలపై చర్చించామని తెలుపుతూ...

వాయిస్ ..30 సెకన్లు

---------------------------

రహదారి ప్రమాద బాధితులను ఆదుకునేలా ప్రధానమంత్రి నరేంద్రమోదీ నేతృత్వంలో తీసుకువచ్చిన 'పీఎం రాహత్' పథకం గొప్ప ముందడుగు అని కేంద్ర బొగ్గుగనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి కొనియాడారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా ఆయన స్పందిస్తూ, రహదారి ప్రమాద బాధితులకు ఉచితంగా అత్యవసర వైద్యం అందించి, వారి ప్రాణాలు కాపాడేందుకు కేంద్ర ప్రభుత్వం మానవతా దృక్పథంతో ఈ పథకం తీసుకువచ్చిందని చెప్పారు. దీనితో ప్రమాదం జరిగినప్పుడు 'గోల్డెన్ అవర్'లో బాధితులకు 1.5 లక్షల వరకు ఉచిత చికిత్స అందుతుందని డయల్ 112 ద్వారా ప్రమాద బాధితులకు అంబులెన్స్ సౌకర్యం ఉంటుందని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు.

---------------------------

తెలంగాణలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన యాదాద్రి భువనగిరి జిల్లాలోని యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానంలో వార్షిక బ్రహ్మోత్సవాలు ఈ రోజు ప్రారంభం కానున్నాయి. ఈ ఉత్సవాలను 11 రోజులపాటు వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి భవానీశంకర్ చెప్పారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈ నెల 24వ తేదీన ఎదుర్కోలు ఉత్సవం, 25న శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి తిరుకల్యాణ మహోత్సవం, 26న దివ్యవిమాన రథోత్సవం నిర్వహిస్తామని తెలిపారు.

---------------------------

సాంస్కృతిక, పర్యాటక, విభాగాలను సమన్వయం చేస్తూ "ఆరెంజ్ ఎకానమీ"ని అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. విజయవాడలోని ఘంటసాల ప్రభుత్వ సంగీత కళాశాలలో సాంస్కృతిక శాఖ అధికారులతో మంత్రి నిన్న సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కందుల దుర్గేష్ మాట్లాడుతూ జూన్ లేదా జూలై మాసాల్లో ఆరెంజ్ ఎకానమీపై ప్రత్యేక కార్యశాలలను నిర్వహిస్తామన్నారు. ప్రతి వారం దేవాలయాలు, హ్యాపీ సండే లాంటి వేదికల్లో స్థానిక కళాకారులకు ప్రదర్శనలిచ్చే అవకాశం కల్పిస్తామని చెప్పారు. కూచిపూడి నృత్య ఉపాధ్యాయుల పథకం పునరుద్ధరణకు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. రాజమహేంద్రవరంలో 'నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా' శాఖ ఏర్పాటు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం సుముఖత వ్యక్తం చేసిందని మంత్రి పేర్కొన్నారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్, తెలంగాణా రాష్ట్రాల్లో చలి తీవ్రత క్రమంగా తగ్గుతుండగా.. ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. వాయవ్య ఈశాన్య దిశగా గాలులు వీస్తున్నాయని, దీంతో తెలుగు రాష్ట్రాల్లో పొడి వాతావరణం కొనసాగుతోందని భారత వాతావరణ శాఖ తెలిపింది. అలాగే కొన్ని ప్రాంతాల్లో పొగమంచు కురిసే అవకాశముందని పేర్కొంది.

=====================